రిపోర్టర్లు కావలెను
ప్రకాశం జిల్లాలో 'జాతీయ వార్త' తెలుగు దినపత్రికలో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు సంప్రదించగలరు
9908862557

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ప్రకాశం

జిల్లా వార్తలు



# డిసెంబర్ నాటికి.. రామాయపట్నం పోర్టు పూర్తి



- వైసీపీ ప్రభుత్వం పట్టించుకోనందువల్లే ఆలస్యం
- ఇప్పటికే 75 శాతం పనులు పూర్తి
- భూనిర్వాసితుల కాలనీలో సకల సౌకర్యాలు
- రామాయపట్నం ప్రాంతంలో శరవేగంగా అభివృద్ధి
- నియోజకవర్గంలో రోడ్లు, వంతెనల నిర్మాణానికి పూర్తి సహకారం
- రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి
- కర్లపాలెం ఆర్అండ్ఆర్ కాలనీలో ఇళ్ల నిర్మాణాల ప్రారంభోత్సవం
- ఇళ్లపట్టాలు పంపిణీ

**గుడ్లూరు, మార్చి 4 (జాతీయ వార్త):** రామాయపట్నం పోర్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి పనులన్నీ పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తి చేశామని చెప్పారు. రామాయపట్నం పోర్టు భూసేకరణలో భాగంగా గుడ్లూరు మండలం సాలిపేట పంచాయతీలోని కర్లపాలెం భూనిర్వాసితుల కోసం కొత్తగా నిర్మించబోయే ఆర్ అండ్ ఆర్ కాలనీలో మౌలిక వసతుల నిర్మాణాలకు మంత్రి బుధవారం ప్రారంభోత్సవం చేశారు. 371 మంది గ్రామస్తులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, కలెక్టర్ రాజాబాబు, మారిటైమ్ బోర్డు సీఈవో అభిషేక్ కుమార్, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యే నాగేశ్వరరావు, దామచర్ల సత్య, అధికారులకు కాలనీవాసులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం, రామాయపట్నం పోర్టు గురించి అసలు పట్టించుకోలేదని, కేవలం వారి అవసరాల కోసమే హడావుడి చేశారని అన్నారు. ఆ పార్టీ నేతలు కోర్టులో కేసులు వేసిన కారణంగానే పనుల్లో ఆలస్యం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఆ చిక్కుముడులను ఒక్కొక్కటిగా విప్పుకుంటూ వచ్చామన్నారు. తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో 75 శాతం పనులను పూర్తి చేసిందని, మిగిలిన 20 శాతం పనులను ఏడాది చివరికల్లా పూర్తి చేసి ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. దాదాపు 5 వేల కోట్ల రూపాయలతో రామాయపట్నం పోర్టు నిర్మాణం పూర్తి చేసుకుంటుందని, ఈ ప్రాంతమంతా శరవేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పోర్టు పూర్తయితే ప్రత్యక్షంగా 10 వేలు, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలియజేశారు. పోర్ట్ కోసం రైతులు తమ ఊరిని, భూములను త్యాగం చేశారని, వారి త్యాగాలను తమ ప్రభుత్వం మరిచిపోదన్నారు. కొత్తగా నిర్మించబోయే నిర్వాసితుల కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. సుమారు 41 కోట్ల రూపాయల ఖర్చుతో 371 మంది లబ్ధిదారులకు, 43 ఎకరాల విస్తీర్ణంలో కాలనీ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, అంగన్వాడీ కేంద్రం, పాఠశాల, రామాలయం, విద్యుత్ సౌకర్యం, ఇంటింటికి తాగునీరు, చుట్టూ ప్రహరీ నిర్మాణంతో కాలనీని చక్కగా తీర్చిదిద్దారని మంత్రి మెచ్చుకున్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు స్వయంగా ఇళ్ల పట్టాలు అందజేశారు. ఇళ్ల పట్టాలు పొందిన వారంతా త్వరలోనే ఇల్లు నిర్మించుకోవాలని కలెక్టర్ రాజాబాబు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ జనిగర్ల నాగరాజు, మండల టిడిపి అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, దామా మల్లేశ్వరరావు, పూరిమిట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, సర్పంచ్ చాపల రమణయ్య, పార్టీ నేతలు పోకూరి రాంబాబు, చిలకపాటి మధు, బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, చదలవాడ కొండయ్య, షేక్ పెదబాబు, కొక్కిలిగడ్డ సుబ్రహ్మణ్యం, మద్దసాని శ్రీను, వెంకటేశ్వర్లు, గద్దగుంట శ్రీను, ఆవుల రమణయ్య, ఆవుల శ్రీను, అట్లా కోటయ్య, చల్లా వేముల స్వామి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.










## సంపన్న నియోజకవర్గంగా.. కందుకూరు

మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ ప్రైవేటు లేఅవుట్ల కంటే, ప్రస్తుతం నిర్మిస్తున్న కాలనీ వాతావరణం చక్కగా ఉందన్నారు. రామాయపట్నం పోర్టు నిర్మాణంతో కందుకూరుతో పాటు కొండపి నియోజకవర్గంలో కొంత భాగం అభివృద్ధి చెందుతుందన్నారు. పోర్టు, బిపిసిఎల్, ఇండోసోల్, వాటి అనుబంధ పరిశ్రమల ద్వారా కందుకూరు నియోజకవర్గం త్వరలోనే సంపన్న నియోజకవర్గంగా మారబోతోందని అన్నారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, మారిటైం బోర్డు సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేశారు.

## భూములు ఇచ్చిన వారికి మెరుగైన ప్యాకేజీ



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ నిర్వాసితుల కాలనీల నిర్మాణంలో సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి జనార్దన్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాంతంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు భారీ ఎత్తున రాబోతున్నాయని, 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే వస్తాయని తెలిపారు. భూములు ఇచ్చిన రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి మెరుగైన ప్యాకేజీ ఇచ్చేలా ఒప్పించానని చెప్పారు. భూములు ఇచ్చిన ఆవులవారిపాలెం, మొండివారిపాలెం, కర్లపాలెం, సాలిపేట గ్రామాలలోని 680 మంది లబ్ధిదారులకు, సుమారు 80 కోట్ల రూపాయల ఖర్చుతో 70 ఎకరాల విస్తీర్ణంలో కాలనీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. అలాగే కందుకూరు నియోజకవర్గంలో పలు రోడ్లు, వంతెనల నిర్మాణం గురించి సభలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రస్తావించారు. వలేటివారిపాలెం నుంచి లింగసముద్రం వెళ్లే రోడ్డును డబుల్ రోడ్డు గా మార్చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మన్నేరుపై మాచవరం, కలవళ్ళ దగ్గర వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే మత్స్యకారుల కోసం కర్లపాలెం దగ్గర జెట్టి నిర్మాణానికి 20 కోట్లు మంజూరయ్యాయని, అయితే జెట్టి పొడవును పెంచి నిర్మించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే వివరించారు. దీనికి మంత్రి జనార్దన్ రెడ్డి స్పందిస్తూ రాబోయే బడ్జెట్లో రోడ్లు, వంతెనల నిర్మాణానికి తగిన నిధులు కచ్చితంగా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. జెట్టి పొడవు పెంచి నిర్మించేలా చర్యలు తీసుకుంటామని దామచర్ల సత్య హామీ ఇచ్చారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
ప్రకాశం





## ఆర్థిక అక్షరాస్యతపై మహిళలకు అవగాహన

**వలేటివారిపాలెం, మార్చి 4 (జాతీయవార్త):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం కల్పిస్తున్న బ్యాంకు సౌకర్యాలు, ఆర్థిక అక్షరాస్యతపై మహిళలకు అవగాహన కల్పించారు మిషన్ శక్తి 20 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పొదుపు సంఘాల మహిళలకు ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకు రుణాల గురించి సూపర్వైజర్ సునీత వివరించారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రూపులో సక్రమంగా సరైన పద్ధతిలో ప్రతినెలా బ్యాంకులకు వాయిదాలను కట్టుకుంటూ ఇంకా ఎక్కువ మొత్తంలో బ్యాంకుల నుండి రుణాలను పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం శ్రీనివాసులు, వెలుగు సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్త ఎస్తేరి, పొదుపు సంఘాల లీడర్స్ పాల్గొన్నారు.

## కందుకూరు డివిజన్ నేర సమీక్ష సమావేశం



**కందుకూరు, మార్చి 4 (జాతీయవార్త):** కందుకూరు సబ్ డివిజన్ పోలీసు కార్యాలయంలో బుధవారం సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల అధికారులతో నెల వారీ నేర సమీక్ష సమావేశం డి.ఎస్.పి బాలసుబ్రమణ్యం నిర్వహించారు. చిల్డ్రన్స్ క్రైమ్, ఉమెన్స్ పోక్సో, సీనియర్ సిటిజెన్, ప్రాపర్టీ ఆఫన్సెస్ సైబర్ క్రైమ్స్ , మిస్సింగ్, తదితర కేసులపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న అన్ని కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈనెల 14న మెగా లోక్ అదాలత్ ఉంటుందన్నారు. రాజీ అయ్యే కేసులను లోక్అదాలత్‌కు వచ్చేలా చూడాల్సిన బాధ్యత కోర్టు కానిస్టేబుళ్లపై ఉందన్నారు. సమావేశంలో కందుకూరు సీఐ అన్వర్ బాషా, కొండేపి సీఐ, కందుకూరు టౌన్, కందుకూరు రూరల్, ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం, వివిపాలెం, కొండేపి, పొన్నలూరు, మర్రిపూడి ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## నేడు కార్యకర్తలతో సమావేశం



**కందుకూరు, మార్చి4(వార్త):** మాజీ శాసన సభ్యులు, కందుకూరు నియోజకవర్గం వైయస్ఆర్ సీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కందుకూరు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. అలాగే నియోజకవర్గంలో పలు సమస్యలపై కార్యకర్తలు, నాయకులతో సమావేశమై చర్చించనున్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణ కమిటీలపై చర్చించామని తెలిపారు.

## గుడ్లూరులో గ్రావెల్ దందా

**గుడ్లూరు మార్చి 4, (జాతీయ వార్త):** గుడ్లూరు మండలంలో కొందరు అక్రమార్కులు వల్ల సాగునీటిని అందించే చెరువులు రూపుమారుతున్నాయి. మండలంలోని పలు చెరువులను అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి జేసీబీలతో చెరువుల్లోని గ్రావెల్ తవ్వేసి తరలించుకుపోతున్నాడు. ఎవరైనా అడిగితే వారిపై దుర్భాషలాడుతున్నాడు. అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో సంబంధిత అధికారులు సైతం కళ్లుమూసుకున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.



# ఆ కల్వర్టులు.. ప్రమాదాలకు నిలయాలు

* మలుపులు దగ్గర సూచిక బోర్డులు లేక ఇబ్బందులు * పట్టించుకోని అధికారులు * ఆందోళన చెందుతున్న వాహనదారులు



**లింగసముద్రం, మార్చి 4 (జాతీయ వార్త):** రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువపై నిర్మించిన కల్వర్టుకు రక్షణ గోడ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పెంట్రాల గ్రామం నుండి చీమల పంటకు వెళ్లే రోడ్డులో ప్రాజెక్టు ఎడమ కాలువపై కల్వర్టు నిర్మించారు. ఆ సమయంలో కల్వర్టుకు రెండువైపులా రక్షణ గోడలు నిర్మించారు. తర్వాత కాలంలో కల్వర్టుకు రెండువైపులా ఉన్న రక్షణ గోడ పడిపోయింది. దీంతో అక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కల్వర్టు వద్దనే తారు రోడ్డు మలుపు ఉండడం, కల్వర్టుకి ఒకవైపు రక్షణ కూడా లేకపోవడం వల్ల రాత్రి సమయాలలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు పలు ప్రమాదాలు ఆ ప్రాంతంలో గతంలో చోటుచేసుకున్నాయి. గతంలో ఒకసారి ప్రమాదం జరిగినప్పుడు ఓ మహిళ మృతి చెందింది. కల్వర్టు వద్ద మలుపు దగ్గర ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి.

### సూచిక బోర్డులు ఎక్కడ?

పెంట్రాల



నుండి చీమల పెంట

మీదగా విఆర్ కోట పోకుల వరకు ఉన్న ఆర్ అండ్ బి రోడ్డుకు అనేక మలుపులు ఉన్నాయి.ముఖ్యంగా చీమలపెంట తూనుగుంట మధ్యలో సుమారు ఐదారు మలుపులు ఉన్నాయి.ఎక్కడ కూడా మలుపులు ఉన్న దగ్గర సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. దీనివల్ల అనేక ప్రమాదాలు నిత్యం జరుగుతున్న అధికారులు మాత్రం ఎలాంటి చలనం లేదు. ఆర్ అండ్ బి రోడ్డు అయినప్పటికీ అధికారులు పర్యవేక్షణ మాత్రం కనిపించడం లేదు. ఇతర ప్రాంతాల నుండి వచ్చే వాహనదారులు మలుపులు గురించి తెలియక తరచు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం ఈ రోడ్డు మార్గాన ఆర్టీసీ బస్సులు, లారీలుట్రాక్టర్లు ఇతర వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్డు మలుపులను చూసి వారు భయాందోళనకు గురవుతున్నారు.

### తరచూ ప్రమాదాలు

ఈ రోడ్డు మార్గాన ఉన్న దగ్గర తరచూ ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయి. ద్విచక్ర వాహనదారులు వేగంగా వచ్చి మలుపులు వద్ద బైకు అదుపుతప్పి కిందపడడం, పొలాల్లోకి దూసుకు వెళ్లడం వంటివి జరుగుతున్నాయి. రాత్రి సమయాలలో మలుపులు దగ్గర ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడం వల్ల దగ్గరికి వచ్చేదాకా మలుపు ఉన్నదన్న విషయం వాహనాల చోధకులు గుర్తించలేకపోతున్నారు. రోడ్డుకు రెండువైపులా జామాయిల్ సాగు చేయడం తో ఎదురుగా వస్తున్న వాహనాలను గమనించలేకపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మలుపులు దగ్గర సూచిక బోర్డులను ఏర్పాటుచేసి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



## సినీ నటుడు అజయ్ ఘోష్‌కి 'కుర్రా కోటి సూర్యమ్మ'
# స్మారక జీవన సాఫల్య పురస్కారం



**ఒంగోలు, మార్చి4(జాతీయవార్త):** శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సాహిత్య సేవాసమితి ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ ఉదయం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించే శ్రీపరాభవ నామ తెలుగు సంవత్సర ఉగాది వేడుకలలో ప్రముఖ సినీ నటుడు అజయ్ ఘోష్‌కి కుర్రాకోటి సూర్యమ్మ స్మారక జీవన సాఫల్య పురస్కారం అందిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆహ్వాన కవి సమ్మేళనం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. అజయ్ ఘోష్ సినిమా రంగంలోకి రాకముందు ఒక లక్ష్యంతో కళా రంగంలో విజయాలు సాధించారన్నారు. సమాజం పట్ల అజయ్ ఘోష్ కి ప్రత్యేక దృక్పథం ఉందన్నారు. తాను ఎంత ఎదిగినా సామాన్యుడి గానే భావిస్తారని చెప్పారు. 2004లో సిబిఐ ఆఫీసర్ అనే చిత్రం ద్వారా ఈయన సినీ రంగ ప్రవేశం జరిగిందని తెలిపారు. నాటక రంగం పట్ల కూడా ఆయనకి విశేషం మక్కువ ఉందన్నారు. రంగస్థలం మీద వివిధ పాత్రలు పోషించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారని చెప్పారు. ఈ విధంగా సినీ ప్రస్థానం కొనసాగిస్తున్న సమయంలో సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన పుష్ప చిత్రంలో కొండారెడ్డి పాత్ర పాన్ ఇండియా స్థాయిలో ఆయనకి గుర్తింపు తెచ్చిందని చెప్పారు. ఈ విధంగా నాటక, సినీ, ప్రజాసేవలో తనదైన బాణితో ముందుకు సాగుతున్న ఆయనను జీవన సాఫల్య పురస్కారానికి తమ కమిటీ ఎంపిక చేసిందన్నారు. మార్చి 18వ తేదీ జరిగే సభలో జిల్లా ప్రముఖుల చేతుల మీదుగా ఆయనకు ఈ జీవన సాఫల్య పురస్కారం అందజేయడం జరుగుతుందన్నారు. కవులు, కళాకారులు, భాషాభిమానులందరూ ఈ కార్యక్రమానికి హాజరై దిగ్విజయం చేయాలని కుర్రా ప్రసాద్ బాబు కోరారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546